# నగరంలో అద్భుతమైన ప్రగతి



వాల్మీకి మహర్షికి పూజలు చేసిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- తిరుమల్‌నగర్‌లో ఆత్మీయ సమ్మేళనం

కార్పొరేషన్, అక్టోబర్ 28: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కరీంనగర్‌లో జీవన ప్రమాణాలు పెరిగాయని, వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగరంలోని తిరుమల్‌నగర్ వాసుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. మంత్రికి మాజీ కార్పొరేటర్ నలువాల రవీందర్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మంత్రి గంగుల కమలాకర్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మానేరు రివర్ ఫ్రంట్‌ను అద్భుత కట్టడంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. విలువైన ఓటును బీఆర్ఎస్‌కు వేసి అభివృద్ధిని కొనసాగించాలని సూచించారు. వేల కోట్ల నిధులు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను అయోమయంలోకి నెట్టివేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అభివృద్ధి సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

### వాల్మీకి మహర్షికి పూజలు

వాల్మీకి జయంతిని పురస్కరించుకొని వాల్మీకినగర్‌లోని వాల్మీకి మహర్షి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. వాల్మీకి బోయలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, స్థానిక నాయకుడు వంగల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో ట్రిపుల్ ధమాకా



డ్రా తీస్తున్న బ్యాంకు మేనేజర్ మహేందర్

విద్యానగర్, అక్టోబర్ 28: కరీంనగర్‌లోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ట్రిపుల్ ధమాకా నిర్వహించారు. ట్రిపుల్ ధమాకాలో వస్త్రాలపై ఆఫర్లు, స్పాట్ గిఫ్ట్‌లు, లక్కీడ్రాలు, వీక్లీ బంపర్, రూ. రెండు వేల విలువైన వస్త్రాల కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్‌లను అందజేశారు. శనివారం రాత్రి నిర్వహించిన బంపర్ డ్రాకు ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ మేనేజర్ మహేందర్–ఉమా దంపతులు హాజరై డ్రాను తీశారు. మూడు వారాల పాటు వీక్లీ డ్రాలు, లక్కీ డ్రాలు, ఐదు ఎల్ఈడీ టీవీలు, 5 సిల్వర్ గ్లాస్‌లు, 5 గ్రైండర్లు, 5 స్మార్ట్ వాచ్‌లను గిఫ్ట్‌గా అందించారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్వాహకుడు గౌరిశెట్టి అరుణ్ మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు అందుబాటులో ధరల్లో వస్త్రాలను అందిస్తున్నామన్నారు. ట్రిపుల్ ధమాకాతో మంచి స్పందన లభించిందన్నారు. అదేవిధంగా వచ్చే దీపావళి సందర్భంగా లక్కీ బంపర్ డ్రాలు ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బంపర్ డ్రాగా ఆల్టో కే–10 కారును సిద్దిపేటకు చెందిన బీ కవిత గెలుచుకున్నారు. వీరితో పాటు 20 మందికి లక్కీ డ్రాలో ఎల్ఈడీ టీవీలు, సిల్వర్ గ్లాస్‌లు, స్మార్ట్ వాచ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ జూడో దినోత్సవం

కొత్తపల్లి, అక్టోబర్ 28: కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో గల జూడో అకాడమీలో శనివారం ప్రపంచ జూడో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానేరు విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సరితా రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఈసీ వికాస్‌రాజ్‌కు ఘన స్వాగతం



ఎస్ఈసీకి పూల మొక్క అందజేస్తున్న ఇన్‌చార్జి ఎన్నికల అధికారి ప్రఫుల్ దేశాయ్

కలెక్టరేట్, అక్టోబర్ 28: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు శనివారం కలెక్టరేట్‌లో ఘన స్వాగతం లభించింది. ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారుల సమీక్షలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు జిల్లా పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి ఎన్నికల అధికారి ప్రఫుల్ దేశాయ్ పూల మొక్క అందజేసి, స్వాగతం పలికారు. అలాగే, డీఐజీ రమేశ్‌నాయుడు, జిల్లాలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్ల రిటర్నింగ్ అధికారులు లక్ష్మీకిరణ్, మహేశ్వర్ పూలమొక్కలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఈసీ వికాస్‌రాజ్ అధికారులను పేరు పేరునా పలుకరించి, భుజం తట్టారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాలుగు గంటల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎన్నికల సమీక్షలో పాల్గొన్నారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

విద్యానగర్, అక్టోబర్ 28: జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) మూడు సంవత్సరాల కోర్సుకు మహిళలు, పురుషుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాబాయి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తులను ప్రభుత్వ దవాఖానలో గల స్కూల్ ఆఫ్ నర్సింగ్ కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అత్యావశ్యకరం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

- చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

విద్యానగర్, అక్టోబర్ 28: రొమ్ము క్యాన్సర్‌పై ప్రతి వ్యక్తికి అవగాహన అత్యావశ్యకరమని చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బొమ్మకల్‌లోని చల్మెడ క్యాన్సర్ దవాఖాన, స్పర్శ్ హాస్పైస్ కేర్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కోర్టు చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ తీయగా, ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, అక్టోబర్ నెలను ప్రపంచ ఆరోగ్య సంస్థ రొమ్ము క్యాన్సర్ మాసంగా ప్రకటించగా, ప్రతి సంవత్సరం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డబ్ల్యూహెచ్‌వో తీసిన గణాంకాలు 2020 అంచనా ప్రకారం 13.5 శాతం రొమ్ము క్యాన్సర్ బాధితులు ఉన్నట్లు తెలిపారు. ఈ వ్యాధికి ప్రధాన కారణం ఆలస్యంగా వివాహాలు కావడం, గర్భం దాల్చడం, ధూమపానం, మద్యపానం, జీవనశైలిలో మార్పులేనని వెల్లడించారు. ఇందులో భాగంగా స్పర్శ్ హాస్పైస్ సంస్థ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చల్మెడ క్యాన్సర్ దవాఖానలో నెలకు రెండు విడుతలుగా క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. క్యాన్సర్ టెర్మినల్‌తో బాధపడుతున్న వారికి తగు సూచనలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇండియన్ క్యాన్సర్ సొసైటీ అండ్ ఒరాకిల్ సొల్యూషన్ సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితులకు తక్కువ వ్యయంతో న్యూట్రీషియన్ సప్లిమెంట్ కిట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ, క్యాన్సర్‌పై సమగ్ర అవగాహన కల్పించే క్రమంలో ప్రైవేట్ వైద్య కళాశాలలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అసీం అలీ, దవాఖాన హెచ్‌వోడీ ఏజిలారాసి, వైద్యులు ప్రశాంత్‌కుమార్, రణధీర్‌రెడ్డి, ప్రదీప్, రజిత, వైద్య కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య శిబిరం

విద్యానగర్/కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 28: కరీంనగర్‌లోని మెడికవర్ దవాఖాన, ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాలలోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు 120 మందికి వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కొండపాక కిరణ్‌కుమార్, నాగరాజు, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, స్టాఫ్ సెక్రటరీ ఆడెపు శ్రీనివాస్, మెడికవర్ దవాఖాన అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ప్రిన్సిపాల్‌కు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## బీఆర్ఎస్ హయాంలోనే పద్మశాలీల అభివృద్ధి



పద్మశాలీ సంఘం రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేశ్

తెలంగాణచౌక్, అక్టోబర్ 28: బీఆర్ఎస్ హయాంలోనే పద్మశాలీ కులస్తులు అభివృద్ధి చెందినట్లు తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ వాసాల రమేశ్ పేర్కొన్నారు. నగరంలోని పద్మశాలీ ట్రస్టు భవనంలో పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన డివిజన్ స్థాయి ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ కృషితో రాష్ట్రంలో చేనేత కార్మికులు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారన్నారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, పోపా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సంఘం నాయకులు ప్రవీణ్, ఆంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మంత్రి గంగుల సతీమణి ప్రచారం

కొత్తపల్లి, అక్టోబర్ 28: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు కుటుంబ సభ్యులు ప్రచారం చేస్తున్నారు. మండలంలోని మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో శనివారం గంగుల కమలాకర్ సతీమణి రజిత ప్రచారం చేశారు. ఎంపీపీ పిల్లి శ్రీలత–మహేశ్, జడ్పీటీసీ పిట్టల కరుణ, సర్పంచ్ గొట్టె జ్యోతితో కలిసి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 28: నగరంలోని పద్మనగర్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ సంఘానికి కేటాయించిన స్థలంలో ఈనెల 30న నిర్వహించనున్న నగర ఆటో కార్మికుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు మద్దెల రాజేందర్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో శనివారం సంఘం నగర కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమ్మేళన కార్యక్రమానికి నగరంలోని అడ్డాల అధ్యక్షులు, కార్యదర్శులు, డ్రైవర్లు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు నాగభూషణం, చంద్రశేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

## 'వశిష్ట' దవాఖానలో మహిళ మృతిపై విచారణ

విద్యానగర్, అక్టోబర్ 28: నగరంలోని వశిష్ట దవాఖానలో కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఎల్లవ్వ మృతి చెందగా, ఈ ఘటనపై శనివారం వైద్యాధికారులు విచారణ చేపట్టారు. ఇందులో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, ప్రభుత్వ దవాఖాన జనరల్ సర్జన్ డాక్టర్ కుమారస్వామి, గైనకాలజిస్టు డాక్టర్ ప్రసన్న విచారణ చేపట్టి వైద్యాధికారులకు నివేదిక పంపించారు.